ఉపాధ్యాయులు టీఎల్ఎమ్ వాడాలి

జిల్లా విద్యాధికారి సుశీంద్రరావు



సాతంరాయి పాఠశాలలో విద్యార్థులతో కలిసి పాఠాలు వింటున్న డీఈఓ సుశీంద్రరావు

శంషాబాద్, ఆగస్టు 5(ఆంధ్రజ్యోతి): ప్రతి ఉపాధ్యాయుడు టీచింగ్ లెర్నింగ్ మెటీరియల్(టీఎల్ఎం)ను వాడాలని రంగారెడ్డి జిల్లా విద్యాధికారి సుశీంద్రరావు అన్నారు. మంగళవారం శంషాబాద్ మున్సిపాలిటీలోని సాతంరాయి ప్రాథమిక పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయుల బోధన తీరును పరిశీలించారు. మెనూ ప్రకారం విద్యార్థులకు భోజనం అందించాలని సిబ్బందికి సూచించారు. అనంతరం పెద్దషాపూర్‌లోని ప్రాథమిక, ఉన్నత పాఠశాలలను తనిఖీ చేశారు. తరగతి గదిలో కూర్చొని ఉపాధ్యాయులు చెప్పే పాఠాలను విన్నారు. అలాగే పెద్ద తూప్రాలోని పాఠశాలను సందర్శించి విద్యార్థులు, ఉపాధ్యాయుల హాజరును పరిశీలించారు. విద్యార్థుల హాజరు పెరిగేలా చూడాలని ఉపాధ్యాయులకు సూచించారు. కార్యక్రమంలో మండల విద్యాధికారి లక్ష్మణ్‌నాయక్ తదితరులు పాల్గొన్నారు.

ఏరో అకాడమీలో ఆన్‌లైన్ కోర్సులు

శంషాబాద్ రూరల్, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): శంషాబాద్ అంతర్జాతీయ విమానాశ్రయంలోని జీఎంఆర్ ఏరో అకాడమీలో ఆన్‌లైన్ సర్టిఫికెట్ కోర్సులకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జీఎంఆర్ అధికారులు పేర్కొన్నారు. ఎయిర్‌పోర్టు, ఎయిర్‌లైన్, ఎయిర్‌కార్గో ఆపరేషన్స్(సీఏఏవో)లో సర్టిఫికెట్ ప్రోగ్రామ్‌ను మంగళవారం ప్రారంభించారు. మూడు నెలల ఆన్‌లైన్ శిక్షణకు దేశంలోని 27 ఏళ్లలోపు గ్రాడ్యుయేట్స్ దరఖాస్తు చేసుకోవచ్చని పేర్కొన్నారు. సివిల్ ఏవియేషన్, రెగ్యులేటర్ బాడీలు, టైమ్ జోన్స్, కస్టమర్ సర్వీస్ స్కిల్స్, ఎయిర్ సైడ్ ఆపరేషన్స్ ర్యాంప్, ఆపరేటర్స్ ఏవియేషన్ సెక్యూరిటీ కార్గో ఆపరేషన్స్‌పై స్కిల్ ఉన్న అభ్యర్థులకు ఉపాధి అవకాశాలు లభిస్తాయని ఎయిర్‌పోర్టు స్ట్రాటజిక్ ఇనిషియేట్ సీఈవో ఆంధ్రూ అక్వా హారిసన్ తెలిపారు.



రేణుకా ఎల్లమ్మ కల్యాణంలో భక్తులు

కల్యాణం.. కమనీయం

కడ్తాల్, ఆగస్టు 5(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని ఎక్వాయిపల్లి గ్రామంలో నూతనంగా నిర్మించిన శ్రీ రేణుకా ఎల్లమ్మ ఆలయంలో మంగళవారం అమ్మవారి కల్యాణాన్ని వైభవంగా నిర్వహించారు. భక్తుల సౌకర్యార్థం నిర్వాహకులు అన్ని ఏర్పాటు చేశారు. మహిళలు బోనాలతో వచ్చి అమ్మవారికి సమర్పించి మొక్కులు చెల్లించారు. బోనాల ఊరేగింపులో శివసత్తుల పూనకాలు, పోతరాజుల విన్యాసాలు ఆకట్టుకున్నాయి. డీసీసీ అధికార ప్రతినిధి గూడూరు శ్రీనివాస్‌రెడ్డి, గ్రామ నాయకుడు శ్రీపతి కిషన్ రెడ్డి అమ్మవారిని దర్శించుకున్నారు. ఆలయ అభివృద్ధికి శ్రీనివాస్‌రెడ్డి రూ.5 వేలు, కిషన్‌రెడ్డి రూ.50 వేలు విరాళం అందజేశారు. కార్యక్రమంలో జోగు వీరయ్య, పాలకుర్ల యాదయ్యగౌడ్, కరుణాకర్ గౌడ్, జంగం సాయిలు, బద్రిపల్లిమదు, పుట్టి యాదయ్య, సుమన్, శంకర్, రమేశ్, సత్తయ్య, బాల్‌రాజ్, సుంకయ్య, హరీశ్, లక్ష్మణ్, శివ, మహేశ్, చందు పాల్గొన్నారు.

ముర్రుపాలతో బిడ్డకు రక్షణ

- జిల్లా వైద్యాధికారి వెంకటేశ్వర్‌రావు



మాట్లాడుతున్న డీఎంహెచ్‌వో వెంకటేశ్వర్‌రావు

రంగారెడ్డి అర్బన్/యాచారం, ఆగస్టు 5(ఆంధ్రజ్యోతి): ముర్రుపాలు బిడ్డకు రక్షణ అని జిల్లా వైద్యాధికారి వెంకటేశ్వర్‌రావు అన్నారు. తల్లిపాల వారోత్సవాల సందర్భంగా మంగళవారం వైద్యారోగ్య శాఖ సమావేశ మందిరంలో నిర్వహించిన సమావేశంలో మాట్లాడుతూ బిడ్డకు తల్లి పాలకు మించిన ఆహారం మరేటి లేదన్నారు. ముర్రు పాలు బిడ్డ ఎదగడానికి ఎంతో దోహదపడుతుందని చెప్పారు. తల్లిపాలలో యాంటిబాడీలు, విటామిన్లు ప్రొటీన్లు ఉంటాయన్నారు. తల్లిపాలు బిడ్డ మానసిక వికాసానికి దోహదపడతాయన్నారు. బిడ్డ పుట్టిన తర్వాత కనీసం ఆరు నెలలపాటు పాలు ఇవ్వాలని సూచించారు. ప్రోగ్రాం అధికారులు డాక్టర్ రాధిక, డాక్టర్ పూనం, మాస్ మీడియా అధికారి శ్రీనివాస్‌లు, డీఎంహెచ్‌వో పీఏ మన్మదమ్మ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న వెంకటరెడ్డి

పంట మార్పిడితో అధిక దిగుబడి

యాచారం, ఆగస్టు 5(ఆంధ్రజ్యోతి): పంట మార్పిడి విధానంతో మంచి దిగుబడి వస్తుందని సమగ్ర సస్యరక్షణ కేంద్రం ప్లాంట్ ప్రొడక్షన్ అధికారి వెంకటరెడ్డి అన్నారు. మంగళవారం మండలంలోని చౌదర్‌పల్లి రైతు వేదికలో ఆకు కూరలు, కూరగాయల సాగుపై రైతులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పంట మార్పిడితో నేల సారవంతం అవుతుందన్నారు. రైతులు సేంద్రియ ఎరువులు వాడాలన్నారు. డ్రిప్, మల్చింగ్ పద్ధతి ద్వారా నీటిని పొదుపుగా వాడుకోవచ్చన్నారు. పంట కాత పడుతున్న సమయంలో లింగాకర్షక బుట్టలు ఏర్పాటు చేయాలన్నారు. కూరగాయల సాగులో రైతులను ప్రభుత్వం అన్నివిధాలుగా ఆదుకుంటుందని మండల వ్యవసాయాధికారి రవినాథ్ అన్నారు. సమావేశంలో సమగ్ర సస్యరక్షణ కేంద్రం ప్లాంట్ సిబ్బంది రాధ, ఉదయ్‌కిరణ్, హొన్నప్పగౌడ, బసవన్నప్ప తదితరులు ఉన్నారు.

శిశువులకు, గర్భిణులకు టీకాలు ఇవ్వాలంటే చెట్ల కిందే కూర్చోవాలి. లేదంటే శిథిలావస్థలో ఉన్న భవనాలు, లేక ప్రభుత్వ పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాల నిర్వాహకులను అడుక్కోవాలి. 22 ఏళ్లుగా వ్యాక్సినేషన్ ప్రక్రియ కొనసాగుతున్నప్పటికీ ఈ రోజుకూ సొంత భవనాలు లేవు. ఒక్క శాశ్వత స్థలం అంటూ లేకపోవడంతో జిల్లాలోని ఆశా వర్కర్లు ఎక్కడపడితే అక్కడ సేవలు అందించాల్సిన దుస్థితి ఏర్పడింది.



ప్రహరీ లేని సబ్ సెంటర్



షాద్‌నగర్‌లో సబ్‌సెంటర్‌గా వినియోగిస్తున్న శిథిల భవనం

వీధుల్లో విధులు..

ఆశాల దిగులు

ఆశా వర్కర్లకు తప్పని తిప్పలు

చెట్ల కింద, పాత భవనాల్లో విధులు

22 సంవత్సరాలుగా ఇదే తీరు..

హెల్త్ సబ్ సెంటర్లకు భవనాలు కరువు

షాద్‌నగర్, ఆగస్టు 5(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో షాద్‌నగర్ కమ్యూనిటీ ఆస్పత్రిలో 2003లో అప్పటి ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ప్రముఖ సాఫ్ట్‌వేర్ అధినేత బిల్‌గేట్స్ ఇమ్యూనైజేషన్ వ్యాక్సిన్లను ప్రారంభించారు. చిన్నారులకు అంటువ్యాధులు, వైకల్యం, ఇతర రోగాలు రాకుండా ఉండేందుకు అప్పటినుంచి ఇక్కడ వ్యాక్సినేషన్ చేస్తున్నారు. వీటిని క్రమం తప్పకుండా ఇచ్చేందుకు షాద్‌నగర్ పట్టణ పరిధిలో నాలుగు సబ్‌సెంటర్లను ఏర్పాటు చేశారు. ప్రతి బుధవారం చిన్నారులు, గర్భిణులు ఆయా సబ్ సెంటర్లకు వచ్చి టీకాలు తీసుకోవాల్సి ఉంటుంది. కానీ, ఒక్కో వారం ఒక్కోచోట వ్యాక్సినేషన్ ప్రక్రియ కొనసాగుతుండటంతో చిన్నారుల తల్లిదండ్రులు, గర్భిణులు ఇబ్బందులు పడుతున్నారు.



సబ్‌సెంటర్ లోపల పరిస్థితి

అద్దె భవనాల్లోనూ అవకాశం లేక

వ్యాక్సిన్ ఇవ్వడానికి ప్రత్యేకంగా సెంటర్లను ఏర్పాటు చేసినా ఎక్కడా కూడా అద్దె భవనం గాని, సొంత భవనం గానీ కేటాయించలేదు. గతంలో అద్దె భవనాలు ఉన్నప్పటికీ వాటికి అద్దె చెల్లించకపోవడంతో వాటిని ఖాళీ చేయించారు. దీంతో వారంలో రెండు రోజులు ఆయా కాలనీలో తిరగడం, లేదా ఆయా కాలనీలో

మిగతా 8వ పేజీలో...

త్వరలోనే భవనాలు మంజూరు చేయిస్తా..



రాష్ట్ర ప్రభుత్వం విద్య, వైద్యానికి ప్రాధాన్యం ఇస్తుంది. నియోజకవర్గం పరిధిలో సబ్ సెంటర్లకు సొంత భవనాలు లేక ఇబ్బందులు పడుతున్న విషయం నా దృష్టికి వచ్చింది. ఈ విషయంపై వైద్యాధికారులతో చర్చించి ముందుగా సబ్‌సెంటర్లకు తాత్కాలిక భవనాలు కేటాయించేలా చర్యలు తీసుకుంటాను. అలాగే ప్రతి సబ్ సెంటర్‌కు సొంత భవనం నిర్మించేందుకు చర్యలు తీసుకుంటాను.

\- ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్



తప్పు చేయకుంటే భయమెందుకు?

టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు బక్కని నర్సింహులు

షాద్‌నగర్ అర్బన్, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): కాళేశ్వరం ప్రాజెక్ట్ నిర్మాణంలో తప్పు చేయకుంటే బీఆర్ఎస్ నేతలకు భయమెందుకని టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు బక్కని నర్సింహులు ప్రశ్నించారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ కమిషన్ నివేదికలో తప్పు ఉంటే కోర్టును ఆశ్రయించి న్యాయం పొందాలన్నారు. కమిషన్ నివేదిక రాగానే మాజీ మంత్రి హరీశ్‌రావు నివేదికకు వ్యతిరేకంగా మాట్లాడడం సరికాదన్నారు. అధికారుల వద్ద వందల కోట్ల అక్రమ ఆస్తులు, నగదు బయటపడుతుంటే, నాటి ముఖ్యమంత్రి, సంబంధిత మంత్రికి వాటా ఉండదా అని అనుమానం వ్యక్తం చేశారు. అవినీతి నిరూపణ జరిగితే చట్టబద్ధంగా శిక్ష తప్పదన్నారు.

నేడు ట్రైనీ సర్వేయర్ల రాక

చౌదరిగూడ/కొందుర్గు, ఆగస్టు 5(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి కొందుర్గు మండలానికి బుధవారం ట్రైనీ సర్వేయర్లు వస్తున్నట్లు తహసీల్దార్లు జగదీశ్వర్, రమేష్ కుమార్ తెలిపారు. జిల్లేడు చౌదరిగూడకు ఆరుగురు, కొందుర్గుకు తొమ్మిది మందిని కేటాయించినట్లు పేర్కొన్నారు. వీరికి ప్రభుత్వ సర్వేయర్ ఆంజనేయులు ఇన్‌చార్జిగా వ్యవహరించనున్నట్లు పేర్కొన్నారు. 40 రోజులపాటు వీరు క్షేత్రస్థాయిలో శిక్షణ పొందనున్నట్లు తెలిపారు.

మహేశ్వరంలో బీఆర్ఎస్‌కు తిరుగులేదు

- ఆరు గ్యారెంటీల అమలులో ప్రభుత్వం విఫలం
- మాజీ మంత్రి, ఎమ్మెల్యే సబితాఇంద్రారెడ్డి



కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే సబితాఇంద్రారెడ్డి

మహేశ్వరం, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): నియోజకవర్గంలో బీఆర్ఎస్‌కు తిరుగులేదని మాజీ మంత్రి, ఎమ్మెల్యే సబితాఇంద్రారెడ్డి అన్నారు. ఆరు గ్యారెంటీలతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ఇచ్చిన హామీలను అమలు చేయడంలో విఫలమైందని ఆరోపించారు. మంగళవారం మండల కేంద్రానికి చెందిన 40 మంది కాంగ్రెస్ నాయకులు బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు కర్రోళ్ల చంద్రయ్య ఆధ్వర్యంలో సబితాఇంద్రారెడ్డి సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరారు. వారికి ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో గులాబీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ.. మహేశ్వరంలో కాంగ్రెస్‌కు మనుగడ లేదని, ప్రజాపాలన పేరుతో ప్రజలను, రైతులను అనేక విధాలుగా మోసం చేసిందన్నారు. మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్‌ను టార్గెట్ చేస్తున్న కాంగ్రెస్ ప్రజలకు ఇచ్చిన హామీలపై దృష్టి పెట్టాలన్నారు. నియోజకవర్గ అభివృద్ధికి అడ్డుపడుతున్న కొందరు కాంగ్రెస్ నాయకుల ఆటలు సాగనీయమన్నారు. స్థానిక ఎన్నికల్లో బీఆర్ఎస్ సత్తా చాటుతామని చెప్పారు. మొదట్లో మహేశ్వరం మండలానికి రైతు భరోసా నిధులను రాకుండా చేసిన కాంగ్రెస్ నాయకులను ప్రజలు తరిమికొట్టే రోజులు దగ్గర్లోనే ఉన్నాయన్నారు. తుక్కుగూడ కేంద్రంగా కొందరు కాంగ్రెస్ నాయకులు బీఆర్ఎస్‌ను అనిచివేయాలని చూస్తున్నారని ఆరోపించారు. కార్యక్రమంలో మహేశ్వరం బీఆర్ఎస్ నాయకులు రాజునాయక్, సుధీర్‌గౌడ్, రాఘవేందర్‌రెడ్డి, నందం, నవీన్, అంబయ్య, సాదత్, కృష్ణ, ఆదిల్, ప్రభాకర్, ఆజం పాల్గొన్నారు.



అధ్వానంగా రోడ్లు

భారీ వర్షాలకు దెబ్బతిన్న రహదారులు

వాహనదారులకు తప్పని ఇబ్బందులు

8

అభివృద్ధి పనులను పటిష్టంగా చేయాలి

ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

7



చౌదరిగూడలో రాకపోకలను నిలువరిస్తున్న పోలీసులు

దంచికొట్టిన వాన

పలు చోట్ల నిలిచిన రాకపోకలు.. పొంగిపొర్లిన వాగులు

కేశంపేట/చౌదరిగూడ, ఆగస్టు 5(ఆంధ్రజ్యోతి): కేశంపేట, చౌదరిగూడ మండలాల్లో మంగళవారం భారీ వర్షం కురిసింది. కేశంపేట మండల పరిధిలోని పాపిరెడ్డిగూడ, ఇప్పలపల్లి, గుట్టలగడ్డతండా, దత్తాయపల్లి, వేములనర్వ చింతకుంటపల్లి, సంగెం, అల్వాల, కేశంపేట, పోమాలపల్లి, లేమామిడి, కాకునూర్ గ్రామాల్లో జోరుగా వర్షం పడింది. మండలంలో రెండో రోజు వర్షం కురువడంతో రైతులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. ఈ వర్షాలతో మొక్కజొన్న, పత్తి పంటలకు జీవం పోసినట్లయిందని రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. మరో వర్షం కురిస్తే మొక్కజొన్న పంట చేతికి వస్తుందని రైతులు చెబుతున్నారు.

చౌదరిగూడలో భారీ వర్షం

జిల్లేడ్ చౌదరిగూడ మండలంలో కురిసిన భారీ వర్షానికి పలుచోట్ల రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. మంగళవారం సాయంత్రం మండల కేంద్రంతోపాటు తుమ్మలపల్లి, లచ్చంపేట్, చౌదరిగూడ, తూంపల్లి, గ్రామాల్లోని వాగులు, వంకలు పొంగిపోర్లాయి. పంట పొలాల్లోకి భారీగా వర్షపు నీరు చేరడంతో నిండుకుండలా మారాయి. పంటపొలాలకు వెళ్లిన రైతులు వరద ప్రవాహం తగ్గే వరకు వాగుల వద్దే గంటల తరబడి వేచి ఉన్నారు.



కేశంపేట: పాపిరెడ్డిగూడలో కురుస్తున్న వర్షం

విద్యుత్ సబ్‌స్టేషన్‌లోకి వరద

కేశంపేటలో సోమవారం కురిసిన భారీ వర్షానికి ట్రాన్స్‌కో కార్యాలయం ప్రధాన గేటు వద్ద భారీగా వరద నీరు చేరింది. దీంతో మంగళవారం కార్యాలయంలోకి వెళ్లడానికి వినియోగదారులు, అధికారులు ఇబ్బందులు పడ్డారు. కార్యాలయాలంలోకి వెళ్లే రెండు దారుల్లో వరద నీరు చేరింది.

సౌకర్యాల కల్పనతోనే మెరుగైన వైద్యం



సిబ్బందితో మాట్లాడుతున్న ఎన్‌క్యూఏఎస్ సభ్యులు

షాబాద్, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని చందనవెళ్లి పీహెచ్‌సీని మంగళవారం జాతీయ నాణ్యత హామీ ప్రమాణాలు(ఎన్‌క్యూఏఎస్) అధికారులు సందర్శించారు. ఈ సందర్భంగా బృందం సభ్యులు డాక్టర్ సుశీల్‌హరిపాండ్ దేశ్‌ముఖ్, డాక్టర్ ఆనంద్ కృష్ణరాజ్ ఆసుపత్రి పరిసరాలను పరిశీలించారు. అనంతరం వారు మాట్లాడుతూ.. సౌకర్యాల కల్పనతోనే మెరుగైన వైద్యం అందుతుందన్నారు. ప్రభుత్వ ఆస్పత్రుల్లో మెరుగైన సేవలు అందించాలని వైద్యులకు సూచించారు. ప్రపంచ ఆరోగ్య సంస్థ మార్గదర్శకాలకు అనుగుణంగా సేవలు అందిస్తున్నారా, లేదా అని నిర్ధారించడం కోసం ఆసుపత్రిని తనిఖీ చేసినట్లు తెలిపారు. ఆసుపత్రిని పరిశుభ్రంగా ఉంచాలని, అన్ని రకాల మందులు అందుబాటులో ఉంచాలన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ నాగేంద్రబాబు, వైద్యుడు ప్రణీత్, తదితరులు ఉన్నారు.

మాదక ద్రవ్యాలను కట్టడి చేయాలి

- డీవైఎఫ్ఐ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వెంకటేశ్



ర్యాలీ నిర్వహిస్తున్న డీవైఎఫ్ఐ నాయకులు, విద్యార్థులు

ఇబ్రహీంపట్నం, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో విద్యార్థులు, యువతను పట్టిపీడిస్తున్న మాదక ద్రవ్యాలు, ఆన్‌లైన్ గేమ్స్ యాప్స్‌లను కట్టడి చేయాలని డీవైఎఫ్ఐ రాష్ట్ర కార్యదర్శి ఆనగంటి వెంకటేశ్ డిమాండ్ చేశారు. గంజాయి, డ్రగ్స్ మత్తు పదార్థాల నిర్మూలనపై రంగారెడ్డి జిల్లా కమిటీ ఆధ్వర్యంలో ఇబ్రహీంపట్నంలో విద్యార్థులతో కలిసి ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యువత ఆన్‌లైన్ బెట్టింగ్‌లకు పాల్పడుతూ ప్రాణాలను కోల్పోతున్నారని, దీంతో కుటుంబాలు రోడ్డున పడుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. సరైన నిఘా లేకపోవడంతో రాష్ట్రంలో విచ్చలవిడిగా గంజాయి విక్రయాలు జరుగుతున్నాయన్నారు. బెట్టింగ్ యాప్స్‌లను నిర్మూలించడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విఫలమయ్యాయన్నారు. సంఘం జిల్లా కార్యదర్శి జగన్, ఉపాధ్యక్షులు ఆల్లంపల్లి జంగయ్య, శివశంకర్, నాయకులు రాఘవేందర్, స్వామి, మహేష్, చైతన్య, ప్రభాకర్, వినోద్, దినేష్, యాదగిరి పాల్గొన్నారు.



సామాజిక పింఛన్ల పంపిణీపై ఎంపీడీవోల ఆరా

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

యాచారం, ఆగస్టు 5(ఆంధ్రజ్యోతి): ఆసరా పింఛన్ల పంపిణీ సరిగ్గా జరుగుతోందా? లేదా అనే అంశంపై గ్రామాల్లో ఎంపీడీవోలు ఆరా తీస్తున్నారు. కొత్తగా ముఖ గుర్తింపు విధానం ద్వారా పింఛన్ల పంపిణీ అంశంపై ఈ నెల 3న 'ఆంధ్ర జ్యోతి'లో కథనం రావడంతో అధికారులు స్పందించారు. ఏయే గ్రామంలో ఎంత మంది పెన్షన్‌దారులున్నారు? కొత్త విధానంలో ఎంతమందికి పంపిణీ చేశారు? అనే విషయాలను ఎంపీడీవోలు తపాలా సిబ్బందిని అడిగి తెలుసుకుంటూ జిల్లా అధికారులకు సమాచామిస్తున్నారు. అందరికీ పింఛన్ పంపిణీ చేయాలని సిబ్బందికి సూచిస్తున్నారు. పోస్టల్ ఉద్యోగులు ఉదయం నుంచి సాయంత్రం వరకు పింఛన్లు పింపిణీ చేస్తున్నారు.

విద్యారంగ, ఉపాధ్యాయ సమస్యలను పరిష్కరించాలి



కలెక్టరేట్ వద్ద ధర్నాలో పాల్గొన్న ఉపాధ్యాయ సంఘాల నాయకులు

వికారాబాద్, ఆగస్టు 5(ఆంధ్రజ్యోతి):రాష్ట్రంలో విద్యా రంగంలో దీర్ఘకాలికంగా ఉన్న సమస్యలను పరిష్కరించాలని ఉపాధ్యాయ సంఘాల పోరాట కమిటీ నాయకులు ఎ.రాములు (టీఎస్‌యూటీఎఫ్) ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం ఉపాధ్యాయ సంఘాల ఐక్య పోరాట కమిటీ వికారాబాద్ జిల్లా స్టీరింగ్ కమిటీ ఆధ్వర్యంలో కలెక్టరేట్ వద్ద ధర్నా నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. ఉపాధ్యాయుల ప్రమోషన్లను పారదర్శకంగా పూర్తిచేయాలని, జీవో 25ను సవరించి ప్రతీ పాఠశాలలో కనీసం ఇద్దరు ఉపాధ్యాయులు, అలాగే 40మంది విద్యార్థులున్న ప్రతీ పాఠశాలలకు తరగతికో ఉపాధ్యాయుడు చొప్పున ఉండేలా చూడాలని కోరారు. ఉన్నత పాఠశాలల్లో సబ్జెక్టు వర్క్‌లోడ్‌కు అనుగుణంగా ఎస్‌ఏలను నియమించాలని, అన్ని పెండింగ్ బిల్లులను విడుదల చేయాలని డిమాండ్ చేశారు. రిటైర్డ్ టీచర్ల బెనిఫిట్స్ అన్ని వెంటనే విడుదల చేయాలని, సీపీఎస్‌ను రద్దుచేసి ఓపీఎస్‌ను పునరుద్ధరించాలని, ఏకీకృత సర్వీసు రూల్స్ రూపొందించాలన్నారు. డీఈడీ ఉన్న సీనియర్ ఎస్జీటీలకు ప్రమోషన్ కల్పించాలని కోరారు. సమగ్ర శిక్ష ఉద్యోగుల సమ్మెకాల జీతాన్ని చెల్లించాలని, కేజీబీవీ, యూఆర్ఎస్, సమగ్రశిక్ష కాంట్రాక్ట్ ఉద్యోగుల సమస్యలు తీర్చాలన్నారు. ధర్నా అనంతరం కలెక్టర్‌కు వినతిపత్రం ఇచ్చారు. టీఎస్ యూటీఫ్ జిల్లా కార్యదర్శులు బాబురావు, పవన్‌కుమార్, శివరాజ్, బసప్ప, వికారాబాద్, ధారూర్, కోట్‌పల్లి మండలాల అధ్యక్షులు రాములు, అజయ్‌కుమార్, రాంచంద్రయ్య, నాయకులు వినోద్‌కుమార్, పరమేశ్, ప్రభాకర్, తిరుపతయ్య కమిటీ సభ్యులు పాల్గొన్నారు.



ఉపాధి పనులపై సామాజిక తనిఖీ


సామాజిక తనిఖీ ప్రజా వేదికలో మాట్లాడుతున్న డీఆర్డీవో శ్రీలత

కందుకూర్, ఆగస్టు5(ఆంధ్రజ్యోతి):కందుకూర్ ఎంపీడీవో కార్యాలయం ఆవరణలో ఉపాధి హమీ కింద చేసిన పనులపై సామాజిక తనిఖీ ప్రజా వేదికను మంగళవారం నిర్వహించారు. డీఆర్‌డీవో శ్రీలత, అడిషనల్ డీఆర్‌డీఏ సుభాషిణిల ఆధ్వర్యంలో 2024-25 ఏప్రిల్ 1 నుంచి 2025 మార్చి 31వరకు 35 పంచాయతీల్లో చేసిన పనులపై తనిఖీ నిర్వహించారు. ఈజీఎస్, పంచాయతీరాజ్, అటవీ శాఖల ఆధ్వర్యంలో చేసిన 813 పనులకు కూలీలకు రూ.6.08కోట్లు,సామగ్రికి రూ.1.9కోట్లు చెల్లించినట్టు అధికారులు తెలిపారు. పనులపై తప్పిదాలు, కొలతల్లో తేడాలు వంటి పొరపాట్లపై సిబ్బంది నుంచి రూ.16వేల రికవరీకి ఆదేశించారు. కార్యక్రమంలో ఎంపీడీవో సరిత, ఏపీడీ చరణ్, విజిలెన్స్ అధికారి కొండయ్య, ఎస్ఆర్‌సీ కాశయ్య, తనిఖీ బృందం, ఉపాధి సిబ్బంది, కూలీలు పాల్గొన్నారు.

మావోయిస్టులను తుదముట్టించేందుకు కేంద్రం యత్నం

● సీపీఐ జిల్లా కార్యదర్శి పాలమాకుల జంగయ్య


సీపీఐ తెలంగాణ రాష్ట్ర మహాసభల పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న నాయకులు

శంషాబాద్, ఆగస్టు 5(ఆంధ్రజ్యోతి): ఆపరేషన్ కగార్ పేరుతో కేంద్ర ప్రభుత్వం మావోయిస్టులను హతమార్చేందుకు, మావోయిస్టు ఉద్యమాన్ని సమూలంగా అణగదొక్కేందుకు కుట్ర చేస్తోందని సీపీఐ జిల్లా కార్యదర్శి పాలమాకుల జంగయ్య అన్నారు. తెలంగాణ రాష్ట్ర సీపీఐ 4వ మహాసభలు ఈ నెల 20 నుంచి 22 వరకు మేడ్చల్ జిల్లా పరిధిలోని కుత్బుల్లాపూర్‌లో నిర్వహిస్తామని తెలిపారు. మహాసభల ప్రచార వాల్ పోస్టర్‌ను మంగళవారం ఆయన పార్టీ నాయకులతో కలసి విడుదల చేశారు. ఈ సందర్భంగా జంగయ్య మాట్లాడుతూ... కేంద్ర ప్రభుత్వం 2026 మార్చి నాటికి మావోయిస్టులు సమూలంగా లేకుండా చేస్తామని కేంద్ర హోంమంత్రి అమిత్‌షా ప్రకటన చేయడం బాధాకరమన్నారు. కమ్యూనిజాన్ని తుడిచిపెట్టడం ఎవరి తరమూ కాదన్నారు. పార్టీ 4వ రాష్ట్ర మహాసభలను విజయవంతం అయ్యేలా చూడాలని పార్టీ కార్యకర్తలకు పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సీపీఐ నాయకులు పుస్తకాల నర్సింగ్‌రావు, పానుగంటి పర్వతాలు, కె.రామస్వామి, యాదయ్య, నర్సింహ, నర్సింహారెడ్డి, సక్రు, మంజుల తదితరులు పాల్గొన్నారు.


















ఎమ్మెల్యే కృషితో విద్యుత్ మెటీరియల్

» ట్రాన్స్‌కో డీఈ శ్యాంసుందర్‌రెడ్డి



షాద్‌నగర్ అర్బన్, ఆగస్టు 5(ఆంధ్రజ్యోతి): షాద్‌నగర్ అసెంబ్లీ నియోజకవర్గంలోని విద్యుత్ సమస్యల పరిష్కారానికి కావాల్సిన మెటీరియల్ వచ్చిందని ట్రాన్స్‌కో డీఈ సి.శ్యాంసుందర్‌రెడ్డి తెలిపారు. కరెంట్ సమస్యలను పరిష్కరించేందుకు మెటీరియల్ కావాలని సోమవారం ఎమ్మెల్యే, రాష్ట్ర ప్రభుత్వ రంగ సంస్థల చైర్మన్ వీర్లపల్లి శంకర్.. ట్రాన్స్‌కో సీఎండీ ముషారఫ్ ఫరూఖ్ అలీకి ప్రతిపాదనలను ఇచ్చారన్నారు. స్పందించిన ఆయన మంగళవారం మెటీరియల్ ఇచ్చారని తెలిపారు. అందులో 72 ట్రాన్స్‌ఫార్మర్లు, 35కిలో మీటర్ల పొడవైన కండక్టర్ వైర్, స్తంభాలు వచ్చాయని తెలిపారు. మరింత కేబుల్ వైరు వస్తుందని చెప్పారు. వినతిపత్రం ఇచ్చిన 24గంటల్లోనే మనకు పెద్దమొత్తంలో మెటీరియల్ రావడం గొప్ప విషయం అని అన్నారు. ఇక నియోజకవర్గంలో విద్యుత్ సమస్యలు తీర్చి ప్రజలకు సౌకర్యాలను పెంచుతామని శ్యాంసుందర్‌రెడ్డి వివరించారు.

పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి

» సీడబ్ల్యూసీ ప్రత్యేక ఆహ్వానితుడు వంశీచంద్‌రెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న వంశీచంద్‌రెడ్డి

ఆమనగల్లు, ఆగస్టు 5(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వ సంక్షేమ, అభివృద్ధి పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని సీడబ్ల్యూసీ ప్రత్యేక ఆహ్వానితుడు, కల్వకుర్తి మాజీ ఎమ్మెల్యే చల్లా వంశీచంద్‌రెడ్డి కాంగ్రెస్ శ్రేణులకు సూచించారు. ఆమనగల్లు, కడ్తాల్, తలకొండపల్లి మండలాల నాయకులు మంగళవారం ఢిల్లీలోని తెలంగాణ భవన్‌లో వంశీచంద్‌రెడ్డిని కలిశారు. ప్రభుత్వ పథకాల అమలు, పార్టీ బలోపేతం, స్థానిక ఎన్నికల్లో అనుసరించాల్సిన వ్యూహంపై చర్చించారు. బీసీలకు స్థానిక సంస్థల్లో 42శాతం రిజర్వేషన్ల బిల్లును కేంద్ర ప్రభుత్వం పార్లమెంట్‌లో ఆమోదించకుండా కాలయాపన చేస్తున్న విషయాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లాలన్నారు. పార్టీ కోసం పనిచేసే నాయకులు, కార్యకర్తలకు గుర్తింపు తప్పక ఉంటుందన్నారు. స్థానిక సంస్థల ఎన్నికలకు అంతా సన్నద్ధం కావాలని సూచించారు. కార్యక్రమంలో పీసీసీ సభ్యుడు ఆయిళ్ల శ్రీనివాస్‌గౌడ్, ఆమనగల్లు బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు యాట నర్సింహ, మార్కెట్ కమిటీ మాజీ వైస్‌చైర్మన్ గుర్రం కేశవులు, ప్యాక్స్ డైరెక్టర్ చేగురి వెంకటేశ్, నాయకులు పాలకూర్ల రాములు, కానుగుల దశరథం, బాల్‌రాజ్ తదితరులు పాల్గొన్నారు.



సీసీ రోడ్డు పనులను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

అభివృద్ధి పనులను పటిష్ఠంగా చేయాలి

షాద్‌నగర్ అర్బన్, ఆగస్టు 5(ఆంధ్రజ్యోతి): షాద్‌నగర్‌లో చేస్తున్న ప్రతీ అభివృద్ధి పనిలో నాణ్యత ప్రమాణాలను పాటించాలని, చేసిన పనులు దశాబ్దాల పాటు మన్నాలని ఎమ్మెల్యే, ప్రభుత్వ రంగ సంస్థల చైర్మన్ వీర్లపల్లి శంకర్ పిలుపునిచ్చారు. షాద్‌నగర్ పట్టణ పరిధి ఫరూఖ్‌నగర్‌లోని నాలుగు వార్డుల్లో చేపట్టిన సీసీ రోడ్లు, అండర్ గ్రౌండ్ డ్రైనేజీ పనులను మంగళవారం ఆయన పరిశీలించారు. ప్రజల నుంచి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. సీసీ రోడ్లు, అండర్ గ్రౌండ్ డ్రైనేజీ నిర్మాణాలు, విద్యుత్ లైన్ల ఏర్పాటు, తాగునీటి సరఫరాకు ప్రాధాన్యమిస్తున్నట్టు తెలిపారు. ప్రతీ ప్రభుత్వ పనిలో నాణ్యత ఉండేలా అధికారులు, స్థానిక కాంగ్రెస్ నాయకులు పర్యవేక్షించాలని సూచించారు. కాంట్రాక్టర్లు నాణ్యతలో రాజీపడొద్దని కోరారు. అనంతరం మహాత్మా గాంధీ విగ్రహాన్ని పరిశీలించారు. పాత విగ్రహం స్థానంలో కొత్తగా కాంస్య విగ్రహాన్ని తాను ఇప్పిస్తానని, అందుకు తగిన ఎత్తు, వెడల్పులతో గద్దె నిర్మించాలని నాయకులను ఆదేశించారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ వైస్‌చైర్మన్ బాబర్‌ఖాన్, యూత్ కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి అందె మోహన్, నాయకులు జమ్రుద్, ఇబ్రహీం, ముబారక్, మురళీమోహన్, దిలీప్, శేఖర్ తదితరులు పాల్గొన్నారు.



కమల్ పాండేతో చర్చలు జరుపుతున్న కార్మికులు, నాయకులు

సీసీఐ కాంట్రాక్టర్‌తో కార్మిక సంఘాల చర్చలు

» కార్మికులను విధుల్లోకి తీసుకోవాలని డిమాండ్

తాండూరు, ఆగస్టు 5(ఆంధ్రజ్యోతి): కరన్‌కోట్‌లోని ప్రభుత్వ రంగ సీసీఐ కర్మాగారంలో నోటీసులు ఇవ్వకుండా ప్యాకింగ్ ప్లాంట్‌లో పని చేసే తొలగించిన 97 మంది కాంట్రాక్ట్ కార్మికులను వెంటనే విధుల్లోకి తీసుకోవాలని కార్మిక సంఘాల నాయకులు, కాంగ్రెస్ నాయకులు కోరారు. మంగళవారం హైదరాబాద్ హిమాయత్‌నగర్‌లో ఏఐటీయూసీ కార్మిక సంఘం ప్రధాన కార్యాలయంలో కార్మిక సంఘాల నాయకులతో చర్చలు జరిపారు. సీసీఐ ప్యాకింగ్ ప్లాంట్ కాంట్రాక్టర్ కమల్ పాండేతో జరిగిన సంఘటనపై క్లుప్తంగా వివరించారు. కార్మికులను విధుల నుంచి తొలగించడంతో వారి కుటుంబాలు రోడ్డున పడ్డాయని నాయకులు అన్నారు. సీసీఐ కాంట్రాక్టర్ కమల్‌పాండే సీసీఐ కర్మాగారానికి వచ్చి చర్చలు జరిపి తొలగించిన కార్మికులను విధుల్లోకి తీసుకోవాలని పాండేకు విన్నవించారు. దీంతో ఆయన స్పందిస్తూ.. రెండు రోజుల్లో సీసీఐకి వచ్చి మాట్లాడతానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు రాజ్‌కుమార్, జర్నప్ప, దస్తప్ప, తాహెర్ పాషా పాల్గొన్నారు.

మొక్కలు నాటి పర్యావరణాన్ని పరిరక్షించుకోవాలి



మోడల్ స్కూల్‌లో మొక్కలు నాటుతున్న అటవీ శాఖ అధికారులు

చేవెళ్ల, ఆగస్టు 5(ఆంధ్రజ్యోతి): మొక్కలు నాటి పర్యావరణాన్ని పరిరక్షించుకోవాల్సిన బాధ్యత ప్రతీ ఒక్కరిపై ఉందని అటవీశాఖ రేంజ్ ఆఫీసర్ లక్ష్మణ్, డిప్యూటీ రేంజర్ రవికుమార్‌లు అన్నారు. మంగళవారం చేవెళ్లలోని మోడల్ స్కూల్‌లో విద్యార్థులు, ఉపాధ్యాయులతో కలిసి మొక్కలు నాటారు. వారు మాట్లాడుతూ.. మొక్కలు నాటి వాటిని చెట్లుగా పెంచితేనే వర్షాలు సంవృద్ధిగా కురుస్తాయన్నారు. చెట్లు నరకడం పర్యావరణానికి హాని చేసినట్టన్నారు. ప్రతీ రైతు పొలాల వద్ద, ఖాళీ స్థలాల్లో మొక్కలునాటి వృక్షాలుగా పెంచాలని సూచించారు. విద్యార్థులు తమ పుట్టిన రోజున మొక్కలు నాటి వాటికి నీరుపోసి పెంచాలని సూచించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ చిన్నపరెడ్డి, అటవీ శాఖ రిటైర్డ్ అధికారి ఎండీ.రఫీ, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.



విజేతలుగా నిలిచిన మెడిసిటీ విద్యార్థులు

రాష్ట్రస్థాయి వాలీబాల్ పోటీల్లో ప్రతిభ

మేడ్చల్ టౌన్, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): ఘనాపూర్ మెడిసిటీ కాలేజ్ ఆఫ్ నర్సింగ్ విద్యార్థులు రాష్ట్ర స్థాయి వాలీబాల్ పోటీల్లో సత్తాచాటారు. స్టూడెంట్స్ నర్సింగ్ అసోసియేషన్ తెలంగాణ వారు సంగారెడ్డిలో నిర్వహించిన పోటీల్లో నర్సింగ్ విద్యార్థులు పాల్గొన్నారు. ఫైనల్‌లో మెడిసిటీ విద్యార్థులు ట్రోఫీని సొంతం చేసుకున్నారు. ఈ మేరకు ట్రోఫీ దక్కించుకున్న విద్యార్థులను మంగళవారం కళాశాలలో ప్రొఫెసర్ శివరామ కృష్ణ, షేర్ మెడికల్ ఫౌండేషన్ ప్రెసిడెంట్ డాక్టర్ సి.మల్లికార్జునరెడ్డి, ప్రిన్సిపాల్ డాక్టర్ హేమవతిరాములు, కళాశాల ఫిజిక్స్ ఎడుకేషన్ డైరెక్టర్ జి.శివారెడ్డి తదితరులు అభినందించారు.



ఉత్సవాలకు ముస్తాబైన ముర్షద్ దర్గా

పెద్దేముల్, ఆగస్టు 5(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ముర్షద్ దర్గా ఉర్సే షరీఫ్ ఉత్సవాలకు ముస్తాబైంది. 79వ ఉర్సే షరీఫ్ ఉత్సవాలు గురువారం(రేపటి) నుంచి నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు ముతావలి అల్హాజ్ సయ్యద్ అబ్దుల్ గనిపాషా మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ నెల 7న ఇంటి నుంచి సందల్, 8న రాత్రికి దీపోత్సవం, 9-30గంటలకు ఖావ్వాలి, 9వ తేదీన నమాజ్ బాద్ ఫజర్ తిలావత్ ఖురన్‌పాక్, పాతేహఖ్వాని, ప్రసాద వితరణ కార్యక్రమాలుంటాయని తెలిపారు. ఉత్సవాలకు తాండూరు, పెద్దేముల్, బషీరాబాద్ మండలాల ప్రజలు, కర్ణాటక రాష్ట్రం చించోలి, గుర్మిట్‌కల్, నల్వార్, కుంచారం, మహబూబ్‌నగర్ జిల్లా కొస్గి, మద్దూర్, మహబూబ్‌నగర్ ప్రాంతాల భక్తులు రానున్నారు.

ఈ-పంచాయతీ అమలేది?

- గ్రామాల్లో పడకేసిన సర్టిఫికెట్ల జారీ ప్రక్రియ
- మండల పరిషత్ నుంచే నిర్వహణ
- మండల కేంద్రానికి వెళ్లలేక గ్రామీణుల ఇబ్బందులు



దేవరఫస్లాబాద్ పంచాయతీ కార్యాలయం

దౌల్తాబాద్, ఆగస్టు 5(ఆంధ్రజ్యోతి): గ్రామ పంచాయతీల్లో ప్రజలకు సేవలను మరింత మెరుగ్గా, వేగవంతంగా అందించేందుకు ప్రభుత్వం ఈ-పంచాయతీ(ఎలక్ట్రానిక్ పంచాయతీ) విధానాన్ని ప్రవేశపెట్టింది. ప్రజలకు అవసరమయ్యే కొన్ని సర్టిఫికెట్లను గ్రామంలో అందించడమే ఈ కార్యక్రమ ఉద్దేశం. ప్రారంభంలో కొన్ని పంచాయతీలకు ఆపరేటర్లను నియమించి కంప్యూటర్లను అందించారు. అయితే కొన్ని పంచాయతీల్లో ఆపరేటర్లు లేక సేవలందలేదు. కొన్నాళ్ల పాటు ఆపరేటర్లు ఉండి కంప్యూటర్లు ఏర్పాటు చేసిన చోట నుంచి క్లస్టర్లుగా విభజించి సేవలందించారు. రానురాను కార్యక్రమం మూలన పడింది. ప్రస్తుతం పంచాయతీ కార్యాలయాల్లో సర్టిఫికెట్లు, ఆన్‌లైన్ సేవలేవీ అందించడం లేదు. మొత్తం మండల కేంద్రం నుంచే ఆపరేట్ చేస్తున్నారు. కాగా దౌల్తాబాద్ మండలంలో మొత్తం 32 గ్రామ పంచాయతీలు ఉన్నాయి. ఈ గ్రామాల ప్రజలు ప్రతీ పనికి మండల పరిషత్ కార్యాలయానికి వెళ్తున్నారు.

పంచాయతీకో టీ-ఫైబర్

ఈ-పంచాయతీ పాలన అమలుకు కార్యాలయాల్లో కంప్యూటర్ ఉండాలి. గతంలో ప్రభుత్వం ఇంటింటికి ఇంటర్నెట్ కనెక్షన్ ఇచ్చేందుకు మిషన్ భగీరథ పైపులైన్‌తో పాటే టీ-ఫైబర్ లైన్ కేబుల్ వేశారు. పంచాయతీ కార్యాలయాల్లో టీ-ఫైబర్ సర్వర్ బాక్సులను ఏర్పాటు చేశారు. కానీ అన్ని పంచాయతీలకు కంప్యూటర్లు సరఫరా చేయలేదు. కొన్ని పంచాయతీల్లో బిగించినా వాటిని కూడా మండల పరిషత్ కార్యాలయాలకు తరలించి అక్కడి నుంచే సేవలందిస్తున్నారు. మండల పరిషత్ కార్యాలయాల నుంచే ఆన్‌లైన్ సేవలందిస్తున్నారు. కొన్నాళ్లపాటు మండలానికి రెండుమూడు క్లస్టర్లను ఏర్పాటు చేసి పెద్ద పంచాయతీల్లో ఆపరేటర్లను నియమించి క్లస్టర్ పరిధి పంచాయతీల ప్రజలకు సేవవలందించారు. ప్రస్తుతం అక్కడ సైతం తొలగించి ఎంపీడీవో ఆఫీసులోనే పనిచేస్తున్నారు. మొత్తానికి 'ఈ-పంచాయతీ' కార్యక్రమాన్ని గ్రామాల్లో అమలు చేయడం లేదు. దీంతో ప్రజలు ఎప్పటి లాగానే పనుల కోసం మండల కేంద్రానికొచ్చి ఇబ్బందులు పడుతున్నారు. అధికారుల నిర్లక్ష్యంతో గ్రామాల్లో కొన్ని రకాల సేవలందించాలనే సదాశయాన్ని నీరుగార్చారు.

అందుబాటులో సమస్త సమాచారం

ప్రతీ పంచాయతీకి అందించే ఈ-సేవలతో గ్రామాల్లో మెరుగైన పౌర సేవలు అందించేందుకు వీలవుతుదని ప్రభుత్వం భావించింది. జనన, మరణ ధ్రువీకరణ పత్రాలు, వివాహాల నమోదు, ఉపాధి జాబ్ కార్డుల జారీ, రేషన్ కార్డులు, పెన్షన్లు, మరుగుదొడ్ల కోసం దరఖాస్తుల స్వీకరణ, వృత్తి, వ్యాపార లైసెన్స్‌ల జారీ వంటి సేవలను ఈ-పంచాయతీల ద్వారా అందించాలి. దీనికి తోడు పన్ను వసూళ్లు, సామాజిక పెన్షన్లు, గ్రామ సమాచారం, ప్రణాళికలు, పలు అనుమతులు, గ్రామ సభల నిర్వహణ తదితర వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు వంటివి ఈ-పంచాయతీ లక్ష్యం. దీని ద్వారా గ్రామ సమాచారం పారదర్శకంగా, కచ్చితంగా వెంటనే లభ్యమవుతుందని ప్రభుత్వం దీన్ని అమలు చేసింది. కార్యక్రమ నిర్వహణపై అధికారులకు, పాలకులకు శ్రద్ధ లేకపోవడంతో మూలనపడింది. అన్ని పంచాయతీల్లో ఇంటర్నెట్ కనెక్షన్‌తో కంప్యూటర్‌ను అమర్చి, ఆపరేటర్లను నియమిస్తే ప్రజలకు మెరుగైన సేవలంది ప్రభుత్వ ఆశయం నెరవేరే అవకాశం ఉంది.

విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించాలి

శామీర్‌పేట, ఆగస్టు 5(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు నాణ్యమైన విద్యను, పరిశుభ్రతతో కూడిన భోజనాన్ని అందించాలని జిల్లా అదనపు కలెక్టర్ రాధికాగుప్తా టీచర్లను, అధికారులను ఆదేశించారు. మంగళవారం తూంకుంట మునిసిపాలిటీ పరిధి సింగాయిపల్లి, తూంకుంటల్లో ప్రాథమిక పాఠశాల, అంగన్‌వాడీ కేంద్రాన్ని ఆమె తనిఖీ చేశారు. మొదట తూంకుంట పాఠశాలకు వెళ్లి విద్యార్థులతో ముచ్చటించి అందిస్తున్న భోజనం, బోధిస్తున్న విద్యపై అడిగి తెలుసుకున్నారు. బోధిస్తున్న పాఠాలను నిత్యం శ్రద్ధగా చదవాలని సూచించారు. మెనూ ప్రకారం పిల్లలకు నాణ్యమైన భోజనం అందేలా చూడాల్సిన బాధ్యత హెచ్‌ఎం, టీచర్లపై ఉందని చెప్పారు. ఈ విషయంలో ఏ మాత్రం నిర్లక్ష్యం చేసినా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అనంతరం అదనపు కలెక్టర్ సింగాయిపల్లిలోని అంగన్‌వాడీ కేంద్రానికి వెళ్లి చిన్నారులతో ముచ్చటించారు. ఈ కేంద్రంలో ఏమైనా సమస్యలున్నాయా? అని టీచర్ జమునను అడిగారు. పిల్లలకు పౌష్టికాహారాన్ని, గుడ్లు సక్రమంగా సరఫరా అవుతున్నాయా? అని అదనపు కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. ఆమె వెంట ఉపాధ్యాయులు, మున్సిపల్ అధికారులు ఉన్నారు.



తూంకుంట పాఠశాలలో విద్యార్థులతో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ రాధికాగుప్తా

ఘనంగా ఆంజనేయ స్వామి విగ్రహ ప్రతిష్ఠ

షాద్‌నగర్ అర్బన్, ఆగస్టు 5(ఆంధ్రజ్యోతి): షాద్‌నగర్‌లోని శివ మారుతి గీతా అయ్యప్ప ఆలయంలో మంగళవారం ఆంజనేయ స్వామి విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఆలయ అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు లష్కర్ ఆంజనేయులు సొంత ఖర్చులతో 12.6పీట్ల ఎత్తు ఉన్న ఆంజనేయస్వామి విగ్రహాన్ని తెప్పించి ప్రతిష్ఠించారు. వేద పండితులు ఆంజనేయస్వామి విగ్రహంతో పాటు దేవసేనవలి సమేత సుబ్రహ్మణ్యస్వామి విగ్రహాల ప్రతిష్ఠాపన పూజలు నిర్వహించిన భక్తులకు తీర్థప్రసాదాలను ఇచ్చారు. కార్యక్రమానికి ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్, ఎమ్మెల్సీ నాగరకుంట నవీన్‌కుమార్‌రెడ్డి,మాజీ ఎమ్మెల్యే అంజయ్యయాదవ్, టీడీపీ పొలిట్ బ్యూరో సభ్యుడు బక్కని నర్సింహులు, గ్రంథాలయ అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు కొప్పుల మదన్మోహన్‌రెడ్డి, వీహెచ్‌పీ సేవా ప్రముఖ్ బండారి రమేశ్, కమ్మసేవా సంఘం అధ్యక్షుడు పాతూరి వెంకట్‌రావు తదితరులు పాల్గొన్నారు.



విగ్రహ ప్రతిష్ఠానలో పాల్గొన్న ఎమ్మెల్సీ నవీన్‌కుమార్‌రెడ్డి

మూగ జీవాలకు మెరుగైన వైద్యమందించాలి

» అదనపు కలెక్టర్ సుధీర్



రిజిస్టర్‌ను పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్ సుధీర్

వికారాబాద్, ఆగస్టు 5(ఆంధ్రజ్యోతి): మూగజీవాలకు ఉత్తమ వైద్య సేవలందించాల్సిన బాధ్యత వైద్యులపై ఉందని జిల్లా అదనపు కలెక్టర్ సుధీర్ అన్నారు. మంగళవారం జిల్లా పశుసంవర్ధక శాఖ పశువైద్యశాల కార్యాలయాన్ని, పశువుల దవాఖానాను తనిఖీ చేశారు. ఆయన మాట్లాడుతూ.. వర్షాకాలంలో పశువులకు వ్యాధులు ఎక్కువ వచ్చే ఆస్కారం ఉందని, అందువల్ల పశువైద్యులు, సిబ్బంది అందుబాటులో ఉంటూ గ్రామాల్లో పశువులకు వైద్యం అందించాలని సూచించారు. సిబ్బంది హాజరును పరిశీలించారు. సమయ పాలన పాటించాలని, ఆస్పత్రి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని తెలిపారు. కార్యక్రమంలో డాక్టర్ విజయలక్ష్మి, సిబ్బంది ఉన్నారు.

మన ఊరు-మన బడి బిల్లులివ్వరా?

అప్పులపాలయ్యామని కాంట్రాక్టర్ల ఆందోళన



బషీరాబాద్ జెడ్పీ పాఠశాలలో ఆవరణలో అసంపూర్తిగా ఉన్న అదనపు గదుల నిర్మాణం

బషీరాబాద్, ఆగస్టు 5(ఆంధ్రజ్యోతి): మన ఊరు-మనబడి కార్యక్రమం కింద ప్రభుత్వ పాఠశాల గదుల మరమ్మతులు, అదనపు గదులు, డైనింగ్ హాల్స్ వంటివి నిర్మించాం. ఆ పనులకు సంబంధించి బిల్లులు చెల్లింపులో నెలల తరబడి తాత్సారం చేస్తుండడంతో ఇబ్బందులు పడుతున్నామని కాంట్రాక్టర్లు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. సీఎం రేవంత్‌రెడ్డి నియోజకవర్గం కొడంగల్ ప్రాంతంలో మన ఊరు-మన బడి కింద చేపట్టిన పనులకు బిల్లుల చెల్లింపులు చేశారని, తమకు మాత్రం బిల్లులివ్వడం లేదని కాంట్రాక్టర్లు రవిప్రసాద్, మాజీ సర్పంచ్ లాలూ వాపోతున్నారు. బషీరాబాద్ మండలంలో ఎక్మాయి, బషీరాబాద్, జీవన్గి, నవాల్గ గ్రామాల్లో రెండేళ్ల కిందట పాఠశాలల్లో పనులు చేశానన్నారు. చేసిన పనుల మేరకు బిల్లులు రాక కొన్ని పనులు అసంపూర్తిగా నిలిచాయని కాంట్రాక్టర్లు వాపోయారు. ఈ పనులకు రూ.35లక్షల వరకు అప్పులు చేశామని కాంట్రాక్టర్ రవిప్రసాద్ తెలిపారు. బిల్లులు రాక ఆర్థిక సమస్యలతో సతమతమవుతున్నామని, కుటుంబాలను పోషించుకోలేపోతున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అప్పిచ్చిన వారు తీర్చాలని వెంటపడుతున్నారని వాపోతున్నారు. ఇప్పటికైనా అధికారులు, ప్రభుత్వం స్పందించి బిల్లులు వచ్చేలా చర్యలు తీసుకోవాలని కాంట్రాక్టర్లు కోరుతున్నారు.

ప్రభుత్వ కార్యక్రమాలను అడ్డుకోవద్దు

» రేషన్ కార్డుల పంపిణీ సభలో మంత్రి శ్రీధర్‌బాబు



సభలో మాట్లాడుతున్న మంత్రి శ్రీధర్‌బాబు

పహాడిషరీఫ్, ఆగస్టు5(ఆంధ్రజ్యోతి): రేషన్ కార్డుల ద్వారా ప్రతీ కుటుంబానికి ప్రభుత్వం నెలకు సగటున రూ.1,200 విలువైన ఉచిత బియ్యాన్ని అందిస్తోందని రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు అన్నారు. మంగళవారం మహేశ్వరం నియోజకవర్గం బాలాపూర్ మండలం మల్లాపూర్‌లోని వైఎఆర్ గార్డెన్స్‌లో నిర్వహించిన రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమానికి హాజరై ప్రసంగించారు. ప్రొటోకాల్ పేరుతో కొందరు రభస సృష్టిస్తున్నారని, పేదలకు మేలుచేసే ప్రభుత్వ కార్యక్రమాన్ని అడ్డుకోవడం సరికాదన్నారు. అనంతరం రేషన్ కార్డులు పంపిణీ చేసి వారితో సహపంక్తి భోజనం చేశారు. కార్యక్రమంలో ప్రభుత్వ చీఫ్ విప్ మహేందర్‌రెడ్డి, అదనపు కలెక్టర్ చంద్రారెడ్డి, కందుకూరు ఆర్డీవో రాజేశ్వర్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యే కిచ్చన్నగారి లక్ష్మారెడ్డి పాల్గొన్నారు. కాగా కార్డుల పంపిణీలో ప్రొటోకాల్ పాటించడం లేదని, ఇది కాంగ్రెస్ పార్టీ కార్యక్రమా? అని ఎమ్మెల్యే సబితారెడ్డి అభ్యంతరం వ్యక్తం చేశారు. కాంగ్రెస్ నాయకులు వేదికపైకి రావడంతో ఎమ్మెల్యే, బీఆర్ఎస్ నాయకులు అభ్యంతరం తెలిపారు. రెండు పార్టీల నాయకులు పరస్పరం నినాదాలు చేశారు. కార్యక్రమాన్ని బహిష్కరిస్తున్నానని సబితారెడ్డి వెళ్లిపోతుండగా పోలీసులు బీఆర్ఎస్ నాయకులను, జర్నలిస్టులను బయటకు పంపించారు. ఎమ్మెల్యే మీడియాతో మాట్లాడుతూ.. కాంగ్రెస్ నాయకులు మంత్రితో కలిసి వేదికపైకి రావడం ప్రొటోకాల్‌కు వ్యతిరేకమన్నారు. పోలీసులు బీఆర్ఎస్ కార్యకర్తలను బయటకు నెట్టారని, ఏసీపీ తనపట్ల దురుసుగా ప్రవర్తించాడని ఆవేదన వ్యక్తం చేశారు.

కాంగ్రెస్ పాలనలో ప్రతీ కుటుంబానికి న్యాయం

» ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి



చెక్కులు అందజేస్తున్న ఎమ్మెల్యే నారాయణరెడ్డి

ఆమనగల్లు, ఆగస్టు 5(ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ పాలనలో ప్రతీ పేద కుటుంబానికి మేలు జరుగుతుందని కల్వకుర్తి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి అన్నారు. సామాజిక న్యాయం, పేదల ఆర్థికాభివృద్ధి కాంగ్రెస్‌తోనే సాధ్యం అన్నారు. కడ్తాల మండలం చల్లంపల్లికి చెందిన ఇద్దరికి మంజూరైన సీఎంఆర్ఎఫ్ చెక్కులను మంగళవారం ఎమ్మెల్యే హైదరాబాద్‌లోని తన నివాసంలో అందజేశారు. అభివృద్ధి పనులపై గ్రామనాయకులతో చర్చించారు. అర్హులందరికీ పథకాలను వర్తింపజేస్తున్నామన్నారు. ఆమనగల్లులో రూ.17.5కోట్లతో నూతన ఆస్పత్రిని నిర్మిస్తున్నట్లు చెప్పారు. కడ్తాలలో త్వరలో 30పడకల ఆరోగ్య కేంద్రాన్ని ఏర్పాటు చేస్తామన్నారు. కార్యక్రమంలో నాయకులు చల్లా సురేందర్ రెడ్డి, పోతుగంటి అశోక్, నాయిని నరేందర్, గణేశ్‌గౌడ్, తిరుపతిరెడ్డి, శ్రీనివాస్, కాసు శ్రీనివాస్‌రెడ్డి, జగన్, నర్సింహ తదితరులు ఉన్నారు.

ప్రకృతి వ్యవసాయంతో అధిక దిగుబడి

» జిల్లా వ్యవసాయాధికారి చంద్రకళ

మూడుచింతలపల్లి, ఆగస్టు 5(ఆంధ్రజ్యోతి): ప్రకృతి వ్యవసాయంతో అధిక దిగుబడి సాధించవచ్చని జిల్లా వ్యవసాయధికారి చంద్రకళ అన్నారు. మూడుచింతలపల్లి మున్సిపాలిటీ పరిధిలోని ఉద్ధమర్రిలో మంగళవారం ప్రకృతి వ్యవసాయంపై రైతులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయంలో జీవామృతంతో సూక్ష్మజీవులు అభివృద్ధి చెంది పైరు ఏపుగా పెరుగుతుందన్నారు. ప్రకృతి వ్యవసాయం చేయడం వల్ల భూమిలో సారం పెరుగుతుందన్నారు. తక్కువ పెట్టుబడితో అధిక దిగుబడి పొందవచ్చన్నారు. కార్యక్రమంలో మేడ్చల్ సహాయ వ్యవసాయ సంచాలకులు వెంకట్‌రాం రెడ్డి, మండల వ్యవసాయధికారి రవికుమార్, శాస్త్రవేత్తలు మధుశేఖర్, దిలీప్, రైతులు తదితరులు పాల్గొన్నారు.


కలెక్టర్‌కు వినతిపత్రం ఇస్తున్న అనిల్

ఇందిరమ్మ ఇళ్ల పేరుతో అక్రమంగా ఇసుక తరలింపు

మాడ్గుల, ఆగస్టు 5(ఆంధ్రజ్యోతి): కొన్నేళ్లుగా అందుగుల వాగు నుంచి ఇసుకను అక్రమంగా తరలించకుండా గ్రామస్తులు కట్టడి చేశారు. అయితే, ఇటీవల ట్రాక్టర్ యజమానులు ఇందిరమ్మ ఇళ్ల పేరుతో ప్రభుత్వ అనుమతులున్నాయని అక్రమంగా వాగు నుంచి ఇసుకను తరలిస్తున్నారని, పోలీసు యంత్రాంగం పట్టనట్లు వ్యవహరిస్తోందని కలెక్టర్ నారాయణరెడ్డికి బీఆర్ఎస్ నాయకుడు అనిల్ విన్నవించారు. ఈమేరకు మంగళవారం కలెక్టరేట్‌లో వినతిపత్రం అందజేశారు. వాగునుంచి ఇసుకను తరలించకుండా నిలుపుదల చేయాలని కోరాడు.

ఎంపీ మల్లు రవిని కలిసిన కాంగ్రెస్ నాయకులు

ఆమనగల్లు, ఆగస్టు 5(ఆంధ్రజ్యోతి): నాగర్‌కర్నూల్ పార్లమెంట్ సభ్యుడు, టీపీసీసీ క్రమశిక్షణ కమిటీ చైర్మన్ డాక్టర్ మల్లు రవిని మంగళవారం తలకొండపల్లి మండలం వెంకట్రావ్‌పేటకు చెందిన కాంగ్రెస్ సేవాదళ్ రాష్ట్ర కార్యదర్శి దశరథం, ఆమనగల్లు ఏఎంసీ మాజీ వైస్‌చైర్మన్ కేశవులు కలిశారు. ఢిల్లీలోని ఆయన నివాసంలో పుష్పగుచ్ఛం ఇచ్చారు. స్థానిక సమస్యలను ఎంపీకి వివరించారు. అభివృద్ధి పనులకు ప్రత్యేక నిధులు మంజూరు చేయించాలని రవిని కోరగా సానుకూలంగా స్పందించినట్లు పేర్కొన్నారు.

అధ్వానంగా రోడ్లు

● వర్షాలకు దెబ్బతింటున్న రహదారులు ● వాహనదారులకు తప్పని ఇబ్బందులు


వర్షాలకు గుంతల్లో నీరు నిలిచిన కొత్తపేట-కొనాయపల్లి రోడ్డు

కేశంపేట/ఆమనగల్లు, ఆగస్టు 5(ఆంధ్రజ్యోతి): వర్షాలకు రోడ్లు అధ్వానంగా తయారవుతున్నాయి. కేశంపేట మండల పరిధిలోని కొత్తపేట-కొనాయపల్లి రోడ్డు దెబ్బతిని అధ్వానంగా మారి వాహనదారులు ఇక్కట్లు పడుతున్నారు. కొత్తపేట-కొనాయపల్లి గ్రామాన్ని కలుపుతూ మహేశ్వరం వెళ్లే మార్గం కాగా.. దాదాపు 6 ఏళ్ల క్రితం బీటీ రోడ్డు చేశారు. అనంతరం మరమ్మతులు చేపట్టలేదు. భారీ వాహనాలు లారీలు, టిప్పర్లు పరిమితికి మించి లోడ్‌తో వెళ్లడంతో బీటీ తేలిపోయి గుంతలు ఏర్పడ్డాయి. చాలా కాలంగా రోడ్డును పట్టించుకోక పోవడంతో పెద్ద, పెద్ద గుంతలు ఏర్పడి ప్రమాదభరితంగా మారింది. వర్షాలు కురిస్తే గుంతల్లో నీరు నిలిచి రోడ్డు మరింతగా దెబ్బతింతోంది. కొత్తపేట నుంచి కొనాయపల్లి వరకు ఉన్న 3 కిలోమీటర్ల రోడ్డు పూర్తిగా దెబ్బతిని ప్రయాణానికి అనుకూలంగా లేకుండాపోయింది. సంబంధిత అధికారులు తక్షణమే స్పందించి రోడ్డును బాగు చేయాలని వాహన చోదకులు, ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు. అదేవిధంగా ఆమనగల్లు మున్సిపాలిటీ పరిధి జంగారెడ్డిపల్లి నుంచి మాడ్గుల మండలం చంద్రాయన్‌పల్లి వరకు బీటీ రోడ్డు నరకప్రాయంగా మారింది. అడుగడుగున బీటీ కొట్టుకు పోయి గోతులేర్పడ్డాయి. తరచూ ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. తాత్కాలిక మరమ్మతులు కూడా చేపట్టకపోవడంతో ప్రయాణికులు రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఆమనగల్లు-చారగొండ ప్రధాన రహదారి మధ్యలో రెండు జిల్లాలను కలిపే ఈ రోడ్డు ఏళ్ల కాలంగా నిర్వహణ కొరవడింది. దాంతో కంకర తేలి గోతుల్లో వర్షపు నీరు నిలుస్తోంది. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక కల్వకుర్తి నియోజకవర్గంలో అనేక రోడ్ల విస్తరణకు నిధులు మంజూరైనా జంగారెడ్డిపల్లి-చంద్రాయన్‌పల్లి రోడ్డు గూర్చి పట్టించుకోకపోవడం పట్ల స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఎమ్మెల్యే నారాయణరెడ్డి చొరవ తీసుకొని రోడ్డును మరమ్మతు చేసి ఆధునీకరించాలని కోరుతున్నారు.


ఆమనగల్లు : గోతులతో జంగారెడ్డిపల్లి- చంద్రాయన్‌పల్లి రోడ్డు

రోడ్డును బాగు చేయాలి



కొత్తపేట- కొనాయపల్లి రోడ్డును బాగు చేయాలి. రోడ్డు పూర్తిగా గుంతల మయంగా మారింది. ఆదారిలో కారు నడపాలంటే భయమేస్తోంది. వాహనదారులు నిత్యం ఇబ్బందులు పడుతున్నారు. అధికారులు స్పందించి రోడ్డును వెంటనే బాగు చేయాలి.

- నర్సింహయాదవ్, మాజీ వైస్ ఎంపీపీ, కేశంపేట

గుంతలతో వేగలేకపోతున్నాం



కొత్తపేట-కొనాయపల్లి రోడ్డు పూర్తిగా అధ్వానంగా మారింది. వర్షం పడితే ఎక్కడ గుంతలున్నాయో తెలియని పరిస్థితి. గంతల్లో నీరు నిలిస్తే వాహనాలు ఎలా నడపాలో అర్థం కావడంలేదు. అధికారులు రోడ్డు మరమ్మతులు చేయించాలి. గుంతల్లో కనీసం మట్టిని పోయించాలి.

- రఘురాములుగౌడ్, బీజేపీ మాజీ మండలాధ్యక్షుడు

వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలి


కందుకూరు : తల్లిపాల ప్రాముఖ్యతను వివరిస్తున్న సీడీపీవో శాంతిశ్రీ


మంచాల : విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న సీడీపీవో వినీతాదేవి

మంచాల, ఆగస్టు 5(ఆంధ్రజ్యోతి): ప్రతిఒక్కరూ వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలని ఐసీడీఎస్ సీడీపీవో వినీతాదేవి సూచించారు. తల్లి పాల వారోత్సవాల్లో భాగంగా మంగళవారం మంచాల మండలం చిత్తాపూర్ ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు హ్యాండ్‌వాష్‌పై అవగాహన కల్పించారు. అనంతరం గృహసందర్శన చేసి రెండేళ్లలోపు చిన్నారులకు అందించాల్సిన ఆహారం, అలవాట్లు, పరిశుభ్రత, బరువు తదితర అంశాలపై తల్లిదండ్రులకు వివరించారు. సూపర్‌వైజర్ కల్ప, టీచర్ విజయ పాల్గొన్నారు.

తల్లిపాలు తప్పక పట్టించాలి

మహేశ్వరం/కందుకూరు/కేశంపేట : శిశువుకు తల్లిపాలు ఎంతో ప్రాధాన్యమైనవని, పుట్టిన గంటలోనే పిల్లలకు పాలు పట్టించాలని మహేశ్వరం సీడీపీవో శాంతిశ్రీ అన్నారు. ప్రపంచ తల్లి పాల వారోత్సవాల్లో భాగంగా కందుకూరు, మహేశ్వరం మండలాల్లోని ఆయా గ్రామాల్లో గర్భిణులు, బాలింతలతో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆమె పాల్గొని మాట్లాడారు. తల్లి పాల ప్రాముఖ్యతకు అధిక ప్రాధాన్యతనివ్వాలన్నారు. డబ్బా పాలకు అలవాటు చేసి పిల్లల ఆరోగ్యంతో ఆడుకోవద్దని, ప్రతీ తల్లి బిడ్డలకు ముర్రుపాలు తాగించాలన్నారు. మహేశ్వరం ఐసీడీఎస్ సూపర్‌వైజర్స్, అంగన్‌వాడీ టీచర్లు తదితరులు పాల్గొన్నారు. కాగా, తల్లిపాలతో బిడ్డకు ఆరోగ్యం చేకూరుతుందని కేశంపేట మండలం కొత్తపేట సెక్టార్ అంగన్‌వాడీ సూపర్‌వైజర్ శమంతకమణి సూచించారు. మండల పరిధిలోని సంగెం అంగన్‌వాడీ కేంద్రంలో మంగళవారం తల్లిపాల వారోత్సవం నిర్వహించారు. గర్భిణులు, బాలింతలు, కిశోర బాలికల నుద్దేశించి మాట్లాడారు. అప్పుడే పుట్టిన బిడ్డకు తల్లి ముర్రుపాలు పట్టించాలని సూచించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు శశికళ, శివలీల తదితరులు పాల్గొన్నారు.


కేశంపేట : సంగెంలో అవగాహన కల్పిస్తున్న సూపర్‌వైజర్ శమంతకమణి

నిబంధనలకు విరుద్ధంగా క్లినిక్‌లు నడిపితే చర్యలు


క్లినిక్‌ను తనిఖీ చేస్తున్న ప్రాథమిక వైద్యాధికారి రేవతిరెడ్డి

శంకర్‌పల్లి, ఆగస్టు 5(ఆంధ్రజ్యోతి): నిబంధనలకు విరుద్ధంగా ఆర్‌ఎంపీలు క్లినిక్‌లను నడిపితే కఠిన చర్యలు తప్పవని శంకర్‌పల్లి ప్రాథమిక ఆరోగ్యకేంద్రం వైద్యాధికారి రేవతిరెడ్డి హెచ్చరించారు. శంకర్‌పల్లి పట్టణంలోని నాలుగు ఆర్‌ఎంపీ క్లినిక్‌లను జిల్లా ఉపవైద్యాధికారి నాగేంద్రబాబు ఆదేశాల మేరకు మంగళవారం ఆమె తనిఖీ చేశారు. ప్రాథమిక చికిత్స చేయాల్సిన ఆర్‌ఎంపీలు క్లినిక్‌ల పేరుతో దర్జాగా బెడ్లు వేసి పలు రకాల చికిత్సలు చేస్తున్నట్లు గుర్తించారు. ప్రభుత్వ నిబంధలకు విరుద్ధంగా నడుపుతున్న ఆర్‌ఎంపీ క్లినిక్‌లపై నివేదికను జిల్లా వైద్యాధికారికి పంపనున్నట్లు ఈ సందర్భంగా ఆమె తెలిపారు.

వీధుల్లో విధులు.. ఆశాల దిగులు

(ఐదో పేజీ తరువాయి)

చెట్ల కింద కూర్చొని విధులు నిర్వహిస్తున్నారు. అదేవిధంగా మల్లికార్జున కాలనీలో కొనసాగుతున్న సబ్‌సెంటర్ అత్యంత ప్రమాదకరంగా ఉంది. ఇంటి మేడ మీద ఉన్న ఒక గదిలో అత్యంత దుర్గంధ భరితంగా ఉండటంతోపాటు గోడలకు నాచు పట్టడం, ప్రహరీ లేకపోవడంతో ఇబ్బందులు ఎదురవుతున్నాయి. గత్యంతరం లేక శిథిల భవనాల్లో వ్యాక్సినేషన్ సెంటర్లను కొనసాగించాల్సి వస్తుందని ఆశా వర్కర్లు వాపోతున్నారు. ఇకపోతే పరిశుభ్రమైన వాతావరణం లేకపోవడం వల్ల చిన్నారులకు అంటువ్యాధులు సోకే ప్రమాదం ఉందని తల్లితండ్రులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

గ్రామీణ ప్రాంతాల్లోనూ ఇదే పరిస్థితి

అంగన్‌వాడీ భవనాల్లో విద్యార్థులసంఖ్య ఎక్కువగా ఉండటంతో వారు ఆశా వర్కర్లకు స్థలం కేటాయించడానికి నిరాకరిస్తున్నట్లు సమాచారం. దాంతో ఆశావర్కర్లే ఊరూరు తిరుగుతూ చిన్నారులకు వ్యాక్సినేషన్ చేస్తున్నారు. చౌదరిగూడ మండల కేంద్రంలోని సబ్‌సెంటర్ కూడా శిథిలావస్థకు చేరింది. ఈదుస్థితి పట్టణ ప్రాంతాలతోపాటు గ్రామీణ ప్రాంతాల్లోనూ నెలకొంది. సబ్‌సెంటర్లకు సొంత భవనాలు కేటాయించాలని ప్రజలు కోరుతున్నారు.

అన్నదాతల గోడు పట్టని ప్రభుత్వం


కేంద్ర పథకాలపై వివరిస్తున్న నాయకులు

యాచారం, ఆగస్టు 5(ఆంధ్రజ్యోతి): నాటి బీఆర్ఎస్ ప్రభుత్వం ధరణి పోర్టల్‌తో, నేటి కాంగ్రెస్ ప్రభుత్వం భూ భారతి పోర్టల్ పేరుతో రైతులను ఇబ్బందుల పాల్జేస్తున్నారే తప్ప.. అన్నదాతల గోడు పట్టించుకోవడం లేదని బీజేపీ రాష్ట్ర క్రమశిక్షణ కమిటీ సభ్యుడు బోసుపల్లి ప్రతాప్ ఆందోళన వ్యక్తం చేశారు. మహా సంపర్క్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా మంగళవారం రెండోరోజు నందివనపర్తిలో ఇంటింటికీ తిరిగి కేంద్ర పథకాలను ప్రజలకు వివరిస్తూ బ్రోచర్‌లను అందించారు. రైతుల భూ తగాదాలు తీర్చడానికి రెవెన్యూ సదస్సులు పెట్టినా.. ఏ ఒక్క రైతు సమస్య తీరలేదన్నారు. సాదాబైనామా దరఖాస్తులు రెవెన్యూ కార్యాలయం నుంచి మాయమవుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. వంటగ్యాస్ రాయితీ డబ్బు ప్రజల ఖాతాలో జమకావడం లేదన్నారు. బీజేపీ మండలాధ్యక్షుడు విజయ్‌నాయక్, నాయకులు గోగికార్ రమేష్, వెంకటరెడ్డి, వన్నవాడ రవీందర్‌రెడ్డి, మాజీ సర్పంచులు ఆర్.విజయ్‌కుమార్, డేరంగుల రాజు, నాయకులు యాదయ్య, నాగరాజు తదితరులున్నారు.

రేపు బీజేపీ ఆధ్వర్యంలో ధర్నా

మాడ్గుల : కాంగ్రెస్ పార్టీ ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీలను నెరవేర్చలేదని నిరసిస్తూ ఈనెల 7న మాడ్గుల మండల కేంద్రంలో బీజేపీ మండల శాఖ ఆధ్వర్యంలో భారీ ర్యాలీ, ధర్నా నిర్వహించనున్నట్లు బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు కాసుల వెంకటేశ్ తెలిపారు. ఈమేరకు మాడ్గులలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఎన్‌బీసీ మాజీ సభ్యుడు ఆచారి నేతృత్వంలో కార్యక్రమం నిర్వహించనున్నట్లు చెప్పారు. మండలాధ్యక్షుడు నల్లకానుల పెద్దయ్య యాదవ్ మాట్లాడుతూ ధర్నాకు మండలంలోని నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో తరలిరావాలని పిలుపునిచ్చారు.

భూ ఆక్రమణలపై చర్యలకు వినతి

తలకొండపల్లి, ఆగస్టు 5(ఆంధ్రజ్యోతి): లింగరావుపల్లిలో పురాతన గ్రామ దేవతలకు సంబంధించిన ప్రభుత్వ స్థలాలను కబ్జా చేసి ఇళ్ల నిర్మాణం చేస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరారు. మంగళవారం ఇన్‌చార్జి తహసీల్దార్ సంతోష్, ఎంపీడీవోలకు ఫిర్యాదు చేశారు. లింగరావుపల్లిలోని సర్వే నెంబర్ 56, 62లో పూర్వం గ్రామ దేవతల గుళ్లు ఉన్నాయని, అక్కడే గ్రామదేవతల గుళ్ల నిర్మాణం కూడా చేపట్టామని, గణేశ్ మండపం, ఎల్లమ్మ ఆలయ నిర్మాణాలకు ఉద్దేశించిన స్థలాలను గ్రామానికి చెందిన కొందరు వ్యక్తులు కబ్జాచేసి ఇళ్ల నిర్మాణం చేస్తున్నారని, ప్రభుత్వ స్థలంలో చేపట్టిన నిర్మాణాలను నిలిపివేసి బాధ్యులపై చర్యలు తీసుకోవాలన్నారు. యాదయ్య, తిరుపతి, జంగయ్య, యాదయ్య, కుమార్‌గౌడ్, అశోక్, మల్లయ్య, అంజయ్య, జంగయ్య తదితరులున్నారు.

సన్మార్గంతోనే దైవానుగ్రహం

కడ్తాల్, ఆగస్టు 5(ఆంధ్రజ్యోతి): సన్మార్గంతోనే దైవానుగ్రహం లభిస్తుందని డీసీసీ అధికార ప్రతినిధి గూడూరు శ్రీనివాస్ రెడ్డి అన్నారు. కడ్తాల మండలం ఎక్వాయిపల్లి శ్రీ రేణుకా ఎల్లమ్మ దేవాలయాన్ని మంగళవారం శ్రీనివాస్‌రెడ్డి సందర్శించారు. అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ అభివృద్ధికి రూ.5 వేలు విరాళం అందించారు. ఆలయ నిర్వాహకులు శ్రీనివాస్‌రెడ్డిని సత్కరించారు. గ్రామస్థులంతా ఏ కమై ఆలయాన్ని నిర్మించుకోవడం అభినందనీయమన్నారు. బీచ్యానాయక్, యాదయ్యగౌడ్, రాజేశ్, రాజేందర్, సుమన్, వీరయ్య, తదితరులు పాల్గొన్నారు.

బీసీ రిజర్వేషన్లపై కాంగ్రెస్ స్పష్టత ఇవ్వాలి

కొందుర్గు, ఆగస్టు 5(ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ పార్టీ ఎన్నికలకు ముందు బీసీలకు 42 శాతం రిజర్వేషన్ కల్పిస్తామని చెప్పిందని.. నేడు రిజర్వేషన్లపై నాయకులు ప్రజలకు స్పష్టత ఇవ్వాలని బీజేపీ మండలాధ్యక్షుడు చిట్టెం లక్ష్మికాంత్‌రెడ్డి డిమాండ్ చేశారు. బీసీలకు 32 శాతం రిజర్వేషన్లు కల్పిస్తే 10 శాతం బీసీలకు అన్యాయం జరిగినట్లేనని అన్నారు. బీసీల పేరుతో ముస్లింలకు రిజర్వేషన్ కల్పించడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. బల్వంత్‌రెడ్డి, బోయ అశోక్, కార్తీక్ యాదవ్, రాంచందర్, లక్ష్మన్ తదితరులు పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న చిట్టెం లక్ష్మికాంత్‌రెడ్డి

కాంగ్రెస్ దుష్ప్రచారాన్ని తిప్పికొట్టాలి


పార్టీలో చేరిన వారికి గులాబీ కండువాలు కప్పుతున్న జైపాల్ యాదవ్

కడ్తాల్, ఆగస్టు 5(ఆంధ్రజ్యోతి): బీఆర్ఎస్ పార్టీ, మాజీ సీఎం కేసీఆర్‌పై కాంగ్రెస్ సాగిస్తున్న దుష్ప్రచారాలు, కుట్రలను తిప్పి కొట్టాలని కల్వకుర్తి మాజీ ఎమ్మెల్యే గుర్కా జైపాల్ యాదవ్ పిలుపునిచ్చారు. ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీల అమలుపై ప్రభుత్వాన్ని, కాంగ్రెస్ నేతలను నిలదీయాలని కోరారు. కడ్తాల మండల కేంద్రంలో మంగళవారం చల్లంపల్లికి చెందిన వివిధ పార్టీల నాయకులు, కార్యకర్తలు జైపాల్‌యాదవ్ సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరారు. శ్రీకాంత్, ప్రేమ్ రాజ్‌ల ఆధ్వర్యంలో పార్టీలో చేరిన వారికి గులాబీ కండువాలు కప్పి పార్టీలోకి స్వాగతించారు. జైపాల్‌యాదవ్ మాట్లాడుతూ ఆరు గ్యారంటీల అమలులో కాంగ్రెస్ విఫలమైందని, వైఫల్యాలను కప్పిపుచ్చుకోవడానికి కాళేశ్వరం ప్రాజెక్ట్‌లో అక్రమాల పేరుతో ప్రజలను తప్పుదోవ పట్టిస్తుందన్నారు. కాళేశ్వరం ప్రాజెక్ట్ విషయంలో కాంగ్రెస్ నేతలు సాగిస్తున్న విష ప్రచారాలు తిప్పికొట్టాలని పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. వాస్తవాలను ప్రజలకు వివరించి చైతన్య పరుచాలని కోరారు. స్థానిక సంస్థల ఎన్నికలకు బీఆర్ఎస్ శ్రేణులంతా సమాయత్తం కావాలన్నారు. హామీలను విస్మరించిన కాంగ్రెస్ ప్రభుత్వానికి గుణపాఠం తప్పదని హెచ్చరించారు. 19 నెలల కాంగ్రెస్ పాలనలో ప్రచార ఆర్భాటమే తప్ప ప్రగతి ఏమీ లేదని ఆరోపించారు. మాజీ జడ్పీటీసీ దశరథ్ నాయక్, రాష్ట్ర సర్పంచ్‌ల సంఘం మాజీ అధ్యక్షుడు లక్ష్మీనర్సింహారెడ్డి, బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు పరమేశ్, రామకృష్ణ, జైపాల్‌రెడ్డి, దర్శన్‌రెడ్డి, గంప శ్రీను, ప్రవీణ్, బాలయ్య, నర్సింహ, శివ, శ్రీశైలం, తదితరులు పాల్గొన్నారు.

ఇందిరమ్మ ఇళ్ల పనులను వేగవంతం చేయాలి

● శంకర్‌పల్లి ఎంపీడీవో వెంకయ్యగౌడ్

శంకర్‌పల్లి, ఆగస్టు 5(ఆంధ్రజ్యోతి): ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలను వేగవంతం చేయాలని శంకర్‌పల్లి ఎంపీడీవో వెంకయ్యగౌడ్ తెలిపారు. మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం ఆయన మాట్లాడుతూ మండలంలో 210 లబ్ధిదారులు ఇంటి నిర్మాణాలను ప్రారంభించారని, 68 మంది బేస్‌మెంట్ పూర్తిచేయగా రూ.లక్ష చొప్పున బిల్లులు అందుకున్నారని, ఇళ్లు మంజూరై 45 రోజులు దాటినా పనులు ప్రారంభించని వారిని జాబితా నుంచి తొలగించడం జరుగుతుందన్నారు. నూతన లబ్ధిదారులను గుర్తించాలని కార్యదర్శులను ఆదేశించారు.

ఢిల్లీ తరలిన కాంగ్రెస్ నేతలు

ఆమనగల్లు/మాడ్గుల, ఆగస్టు 5(ఆంధ్రజ్యోతి): స్థానిక సంస్థల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్ల సాధనకు మంగళవారం ఢిల్లీలో నిర్వహించే మహా ధర్నాకు కల్వకుర్తి నియోజకవర్గం నుంచి కాంగ్రెస్ నాయకులు తరలివెళ్లారు. ఎమ్మెల్యే నారాయణరెడ్డి, ఎంపీ మల్లు రవి, సీడబ్ల్యూసీ ప్రత్యేక ఆహ్వానితుడు వంశీచంద్‌రెడ్డిల ఆధ్వర్యంలో ఢిల్లీకి వెళ్లారు. పీసీసీ సభ్యుడు శ్రీనివాస్‌గౌడ్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు నర్సింహ, వెంకటేశ్, బాల్‌రాజ్, సత్యం, కేశవులు, దశరథం, మండ్లీరాములు, జగన్‌గౌడ్, రమేష్‌గౌడ్, శివకుమార్ తదితరులు ఢిల్లీకి తరలివెళ్లారు.

సర్వాయి పాపన్నగౌడ్ జయంత్యుత్సవాలను విజయవంతం చేయాలి


పోస్టర్ ఆవిష్కరిస్తున్న నాయకులు

కందుకూరు, ఆగస్టు 5(ఆంధ్రజ్యోతి): సర్దార్ సర్వాయి పాపన్నగౌడ్ మహారాజ్ 375వ జయంతి వారోత్సవాలను విజయవంతం చేయాలని కందుకూరు మండల గౌడ సంఘం అధ్యక్షుడు అనేగౌని పాండుగౌడ్ అన్నారు. ఈనెల 10న పాపన్నగౌడ్ జయంతి ఉత్సవాలను నగరంలోని రవీంద్రభారతిలో నిర్వహిస్తున్నందున మంగళవారం కందుకూరులో వారోత్సవాల పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ పాపన్నగౌడ్ జయంతి ఉత్సవాలను విజయవంతం చేసేందుకు రాజకీయాలతో సంబంధం లేకుండా గౌడ సంఘం నాయకులు, కార్యకర్తలు తరలి రావాలన్నారు. మండల గౌడ సంఘం నాయకులు రమేష్‌గౌడ్, దేవేందర్‌గౌడ్, యుగేందర్‌గౌడ్, వెంకటేష్‌గౌడ్, శేఖర్‌గౌడ్, బాల్‌రాజ్‌గౌడ్, తిరుపతిగౌడ్, కృష్ణగౌడ్, సురేష్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

వైద్య చికిత్సకు ఆర్థిక సాయం

తలకొండపల్లి, ఆగస్టు 5(ఆంధ్రజ్యోతి): లింగరావుపల్లికి చెందిన అండాలమ్మ అనారోగ్యంతో చికిత్స పొందుతోంది. మాజీ జడ్పీటీసీ ఉప్పల వెంకటేశ్, బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు ఓరుగంటి వెంకట్‌రెడ్డిలు మంగళవారం పరామర్శించారు. బాధిత కుటుంబానికి చెరో రూ.5వేలు ఆర్థిక సాయం అండాలమ్మ భర్త అంజయ్యకు అందజేశారు.

క్రైం కార్నర్

బైక్‌ల దొంగ అరెస్టు.. రిమాండ్‌కు తరలింపు


వివరాలు వెల్లడిస్తున్న ఏసీపీ లక్ష్మీనారాయణ

షాద్‌నగర్ రూరల్, ఆగస్టు 5(ఆంధ్రజ్యోతి): ఇళ్ల ముందు, బస్టాండ్, తదితర చోట్ల పార్కింగ్ చేసిన వాహనాలను టార్గెట్‌గా చేసుకుని దొంగతనాలకు పాల్పడుతున్న దొంగను అరెస్టుచేసి మంగళవారం రిమాండ్‌కు పంపినట్లు ఏసీపీ లక్ష్మీనారాయణ తెలిపారు. షాద్‌నగర్ పోలీస్ స్టేషన్‌లో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో నేరస్తుడిని ప్రవేశపెట్టి వివరాలు వెల్లడించారు. కొందుర్గు మండలం చెర్కుపల్లికి చెందిన నర్సింలు 19 జూన్ 2025న ఉదయం పది గంటలకు తన మోటార్ సైకిల్‌ను బస్టాండ్ ఆవరణలోని కొరియర్ ఆఫీస్ పక్కన పార్కు చేసి తిరిగి 21న సాయంత్రం వచ్చి చూడగా కనిపించలేదు. అదేరోజు షాద్‌నగర్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసిన పోలీసులు విచారణ చేపట్టారు. ఈమేరకు నిందితుడిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు పంపినట్లు చెప్పారు. కాగా, నిందితుడు షాద్‌నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో నాలుగు, ఆర్‌జీఐ పోలీస్‌స్టేషన్ పరిధిలో ఒకటి, కొత్తూర్ పరిధిలో నాలుగు, అఫ్జల్‌గంజ్ పరిధిలో రెండు బైక్‌లు చోరీ చేసినట్లు పోలీసులు తెలిపారు. గతంలో జైలుకు కూడా వెళ్లి వచ్చాడని, మళ్లీ దొంగతనాలకు పాల్పడుతున్నట్లు ఏసీపీ వివరించారు. సమావేశంలో ఇన్‌స్పెక్టర్ విజయ్ కుమార్, డిటెక్టివ్ ఇన్‌స్పెక్టర్ వెంకట్, శివారెడ్డి ఉన్నారు.

సాగర్ డ్యామ్ నీటిలో పడి యువకుడి గల్లంతు

మంచాల, ఆగస్టు 5(ఆంధ్రజ్యోతి): మండల పరిధి జాపాల గ్రామానికి చెందిన యువకుడు ప్రమాదవశాత్తు నాగార్జున సాగర్‌డ్యామ్ నీటిలో పడి గల్లంతయ్యాడు. జాపాలకు చెందిన మంతని శివ(23) మరో ముగ్గురు స్నేహితులతో కలిసి సోమవారం కారులో నాగార్జున సాగర్‌కు బయలుదేరి వెళ్లాడు. సాయంత్రం డ్యామ్ దిగువన సెల్ఫీదిగే క్రమంలో బ్రిడ్జిపై నుంచి జారిపడి నీటి ప్రవాహంలో కొట్టుకుపోయాడు. స్నేహితుల ద్వారా సమాచారం అందుకున్న తెలుసుకున్న గ్రామస్థులు, కుటుంబ సభ్యులు మంగళవారం ఉదయం నాగార్జున సాగర్‌కు తరలివెళ్లారు. తల్లిదండ్రుల ఫిర్యాదుమేరకు పోలీసులు ఎన్‌డీఆర్‌ఎఫ్ సాయంతో యువకుడి కోసం గాలింపు చేపట్టారు. అయితే, నీటి ప్రవాహం ఉధృతంగా ఉండడంతో శివ ఆచూకీ దొరకడం కష్టతరంగా మారిందని సమాచారం.

విద్యార్థి అదృశ్యం.. కేసు నమోదు


చందు

కొందుర్గు, ఆగస్టు 5(ఆంధ్రజ్యోతి): విద్యార్థి అదృశ్యమైన ఘటన కొందుర్గు మండల పరిధిలోని పర్వతాపూర్ చోటుచేసుకుంది. మంగళవారం పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. గ్రామానికి చెందిన దర్గ మంజుల, నర్సింహుల కుమారుడు చందు కొందుర్గు మండల కేంద్రంలోని ఉన్నత పాఠశాలలో తొమ్మిదో తరగతి చదువుతున్నాడు. ఆదివారం ఉదయం కొందుర్గు హాస్టల్‌కు వెళ్తున్నానని ఇంట్లో చెప్పి వెళ్లాడు. సోమవారం ఉదయం హాస్టల్‌కు తల్లిదండ్రులకు వచ్చి చూడగా చరణ్ హాస్టల్‌కు రాలేదని వార్డెన్ చెప్పాడు. దాంతో తల్లిదండ్రులు ఆందోళనకు గురై పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు జరుపుతున్నట్లు పోలీసులు వివరించారు.

ఇద్దరు చైన్ స్నాచర్ల అరెస్టు

ఇబ్రహీంపట్నం, ఆగస్టు 5(ఆంధ్రజ్యోతి): బైక్‌పై వచ్చి మహిళ మెడలో ఉన్న మంగళసూత్రాన్ని దొంగలించాలని యత్నించిన ఇద్దరు నిందితులను ఇబ్రహీంపట్నం పోలీసులు మంగళవారం అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. సీఐ మహేందర్‌రెడ్డి కథనం మేరకు.. పోల్కంపల్లి(జాజోనిబాయి)కి చెందిన లావణ్య ఈ నెల 1న తన వ్యవసాయ పొలంలో పశువులను మేపుతుండగా ఇద్దరు గుర్తుతెలియని దుండగులు ఏదో అడ్రస్ అడుగుతూ ఆమెతో మాట కలిపారు. ఇంతలో ఆమె మెడలో ఉన్న పుస్తెలతాడు దొంగిలించేందుకు ప్రయత్నించారు. ఆమె పెద్దగా కేకలు వేయడంతో చుట్టుపక్కల వారు వచ్చారు. దాంతో దుండగులు పరారయ్యారు. మహిళ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. సీసీ ఫుటేజీ ఆధారంగా నిందితులను పట్టుకున్నారు. ఒకరిది మహబూబ్‌నగర్ జిల్లా, తలకొండపల్లి మండలం, మరొకరు జడ్చర్లకు చెందిన వారిగా పోలీసులు గుర్తించారు. అరెస్ట్ చేసిన ఇద్దరు నిందుతులను రిమాండ్‌కు తరలించినట్లు సీఐ తెలిపారు.

రెండు కార్లు ఢీ.. ముగ్గురికి తీవ్ర గాయాలు

శంషాబాద్ రూరల్, ఆగస్టు 5 (ఆంధ్రజ్యోతి): రెండు కార్లు ఢీకొన్న ఘటనలో ముగ్గురు వ్యక్తులకు తీవ్ర గాయాలయ్యాయి. ఈ ఘటన మంగళవారం ఆర్జీఐఏ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. సీఐ బాల్‌రాజ్ కథనం ప్రకారం.. మున్సిపల్ పరిధిలోని ఔటర్‌రింగ్ రోడ్డు సర్వీస్ రోడ్డు వీఎస్‌ఆర్ ఫామ్స్ వద్ద గచ్చిబౌలి నుంచి శంషాబాద్ వస్తున్న బీఎండబ్ల్యూ కారు(టీఎస్ 28 జీ9999)ను శంషాబాద్ నుంచి గచ్చిబౌలి వెళ్తున్న హెర్టిగా కారు(టీఎస్07 జేఈ 8196) అతివేగంగా ఎదురెదురుగా ఢీకొంది. దాంతో రమ్య, డ్రైవర్ మల్లికార్జున్‌కు, పద్మజకు తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు శంషాబాద్‌లోని ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. హెర్టిగా డ్రైవర్ విజయ్‌కుమార్‌పై కేసు నమోదు చేశామని సీఐ తెలిపారు. నిందితుడి కారులో మద్యం బాటిళ్లు ఉన్నట్లు పోలీసులు గుర్తించారు. ఈమేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

దివ్యాంగుల పింఛన్లు పెంచేవరకూ పోరాటం

మంచాల, ఆగస్టు 5(ఆంధ్రజ్యోతి): దివ్యాంగుల పింఛన్లు పెంచేవరకూ పోరాటం ఆపేదిలేదని వికలాంగుల హక్కుల పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షుడు కాళ్ల జంగయ్య ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మంగళవారం మంచాలలో జరిగిన వీహెచ్‌పీఎస్ మండల సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడుతూ వికలాంగుల పెన్షన్లు రూ.6వేలకు పెంచుతామంటూ ప్రభుత్వం హామీ ఇచ్చి రెండేళ్లు గడుస్తున్నా ఎలాంటి పురోగతి లేదన్నారు. ఈ నెల 13న చలో హైదరాబాద్ కార్యక్రమం నిర్వహిస్తున్నామని, అన్ని జిల్లాల నుంచి లక్షలాది మందిని తరలిస్తామన్నారు. పెన్షన్‌దారులు పెద్దఎత్తున తరలిరావాలని పిలుపునిచ్చాడు. కార్యక్రమంలో వీహెచ్‌పీఎస్ మండలాధ్యక్షుడు దానయ్య, ఎమ్మార్పీఎస్ మండలాధ్యక్షుడు పల్నాటి సుధాకర్, నాగార్జున, శ్రీనివాస్‌చారి, జంగయ్య, దంచుక అశోక్ తదితరులున్నారు.

రోడ్డు పనులు త్వరగా పూర్తి చేయాలి

శంషాబాద్, ఆగస్టు 5(ఆంధ్రజ్యోతి): శంషాబాద్ మున్సిపాలిటీ పరిధిలోని కొత్వాల్‌గూడ గ్రామం వరకు నిర్మిస్తున్న రోడ్డు పనులను వెంటనే పూర్తిచేయాలని ఎమ్మెల్సీ, ప్రభుత్వ చీఫ్‌విప్ మహేందర్‌రెడ్డి సూచించారు. చెన్నమ్మ హోటల్ నుంచి కొత్వాల్‌గూడ గ్రామం వరకు నూతనంగా నిర్మిస్తున్న రోడ్డును ఆయన మంగళవారం సాయంత్రం పరిశీలించారు. ఈ సందర్భంగా మహేందర్‌రెడ్డి మాట్లాడుతూ గ్రామ ప్రజలకు రోడ్డును త్వరితగతిన అందుబాటులోకి తేవాలని కాంట్రాక్టర్, సిబ్బందిని ఆదేశించారు. రోడ్డు నిర్మాణంలో నాణ్యతా ప్రమాణాలు పాటించాలని సూచించారు.


రోడ్డు పనులు పరిశీలిస్తున్న చీఫ్‌విప్ మహేందర్‌రెడ్డి